కేసీఆర్ కోలుకోవాలని పూజలు

కేసీఆర్ కోలుకోవాలని పూజలు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కామారెడ్డి, డిసెంబర్ 8 : మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ శుక్రవారం తెల్లవారు జామున ప్రమాదవశాత్తు గాయపడ్డ సందర్భంగా త్వరగా కోలుకోవాలని పట్టణంలోని అశోక్‌నగర్‌లో ఉన్న శ్రీహనుమాన్ ఆలయంలో బీఆర్ఎస్ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కేసీఆర్ ఆరోగ్యంగా బయట పడాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జూకంటి ప్రభాకర్ రెడ్డి, నాయకులు రమేశ్‌గుప్తా, జగదీశ్‌యాదవ్, యూత్ అధ్యక్షుడు భాను ప్రసాద్, విద్యార్థి విభాగం అధ్యక్షుడు పృథ్వీరాజ్, వజ్జేపల్లి ఆంజనేయులు, ఆలయ అధ్యక్షుడు గంజి సతీశ్, శ్రీనివాస్, వలిపిశెట్టి కృష్ణ, మురళి పంతులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి విజేతలను అభినందించిన డీఈవో

విద్యార్థులను అభినందిస్తున్న డీఈవో రాజు

కామారెడ్డి, డిసెంబర్ 8 : ఈ నెల 18, 19వ తేదీల్లో కుదురులో నిర్వహించిన రాష్ట్రస్థాయి సెపక్ తక్రా క్రీడా పోటీల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబర్చిన జడ్పీ హెచ్ఎస్ ఎస్సీ వాడ పాఠశాలకు చెందిన నీరజను జిల్లా విద్యాశాఖాధికారి రాజు అభినందించారు. శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ సెక్రటరీ నాయబ్ రసూల్, పాఠశాల ఇన్‌చారి హెచ్ఎం భైరయ్య, ఉపాధ్యాయులు రణ్‌వీర్, రమణ, శ్రీనివాస్, మధుకర్, పీఈటీ సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

మైసమ్మ ఆలయంలో పూజలు

నస్రుల్లాబాద్, డిసెంబర్ 8 : నస్రుల్లాబాద్ మండలం మైలారం గ్రామ శివారులోని మైసమ్మ ఆలయంలో ఆయా ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం భక్తులు ఆలయ ప్రాంగణంలో వన భోజనాలు చేశారు.

నర్సరీల పరిశీలన

నస్రుల్లాబాద్, డిసెంబర్ 8 : మండలంలోని మైలారం, నస్రుల్లాబాద్ గ్రామాల్లోని నర్సరీలను ఎఫ్ఎం రామ్‌నారాయణ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామానికి ఉపయోగపడే మొక్కలను పెంచాలని సూచించారు. ప్రతి గ్రామంలో ఉపాధి హామీ ద్వారా 50 మంది కూలీలను వచ్చేలా చూడాలన్నారు. పూర్తి స్థాయిలో మొక్కలను పెంచాలన్నారు. ఆయన వెంట ఎంపీవో రాము, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

నస్రుల్లాబాద్‌లో నర్సరీని పరిశీలిస్తున్న ఎఫ్ ఎం రామ్‌నారాయణ

పొగమంచు కప్పేసింది..

కామారెడ్డి పట్టణాన్ని కప్పేసిన మంచు దుప్పటి

డోంగీల్లో..

దట్టమైన పొగ మంచుతో నస్రుల్లాబాద్ ప్రధాన రహదారి..

కామారెడ్డి/బాన్సువాడ రూరల్/పెద్ద కొడప్‌గల్/డోంగ్లీ/ఎల్లారెడ్డి రూరల్, డిసెంబర్ 8 : జిల్లాలో చలి తీవ్రత పెరిగింది. తుఫాన్ ప్రభావంతో శుక్రవారం ఉదయం నుంచి కామారెడ్డితోపాటు బాన్సువాడ రూరల్, నస్రుల్లాబాద్ మండల కేంద్రాలు, గ్రామాలను ఒక్కసారిగా పొగమంచు కప్పేసింది. దీంతోపాటు చల్లని ఈదురు గాలులు వీస్తున్నాయి. పొగమంచు పూర్తిగా కమ్ముకోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. లైట్లు వేసుకొని వాహనాలను నడిపారు. కొన్ని చోట్ల యువకులు, పిల్లలు ఆహ్లాదకరమైన వాతారణాన్ని ఎంజాయ్ చేస్తూ సెల్‌ఫోన్లలో బందించారు. మరికొంత మంది ప్రజలు తీవ్రంగా చలి ఉండడంతో ఇంటి నుంచి బయటికి రావాలంటేనే బయపడుతున్నారు. ఉదయం 7 గంటలైనా ఎండ రావడం లేదు.

కామారెడ్డిలో రహదారిని కమ్మేసిన పొగమంచు

పార్కును పరిశీలించిన మున్సిపల్ చైర్మన్

పార్కులో పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ గంగాధర్

బాన్సువాడ, డిసెంబర్ 8 : పట్టణంలో రాష్ట్ర మాజీ శాసనసభాపతి, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి ప్రత్యేక కృషితో సుమారు రూ.4 కోట్లతో నిర్మించిన పార్కును మున్సిపల్ చైర్మన్ గంగాధర్ బీఆర్ఎస్ నాయకులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. అక్కడ సిబ్బందితో మాట్లాడి పార్కులో పరిశుభ్రతను పాటించాలని, ఆహ్లాదం కోసం వచ్చే ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకుడు ఉదయ్‌గుప్తా ఉన్నారు.

సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులు..

బాన్సువాడ టౌన్, డిసెంబర్ 8 : బాన్సువాడలోని పలు వార్డుల్లో చేపట్టిన సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులను మున్సిపల్ చైర్మన్ గంగాధర్ పరిశీలించారు. 80 శాతం డ్రైనేజీలు, సీసీ రోడ్ల నిర్మాణం పూర్తయ్యిందన్నారు. మిగిలిన పనులను త్వరలో పూర్తి చేయాలన్నారు. వారితో స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రేపు ఎన్ఎంఎంఎస్ పరీక్ష

కామారెడ్డి, డిసెంబర్ 8 : నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్ షిప్ నీమ్స్ పరీక్ష ఈ నెల 10వ తేదీ ఆదివారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు డీఈవో రాజు శుక్రవారం తెలిపారు. హాల్ టికెట్‌లను ప్రభుత్వ పరీక్షల సంచాలకుల కార్యాలయ వెబ్‌సైట్ http//bse.telangana.gov.in నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని తెలిపారు. ఆన్‌లైన్‌లో హాల్‌టికెట్లను డౌన్ లోడ్ చేసుకొనేందుకు ఏ ఐడీ పాస్‌వర్డ్‌తో రిజిస్టర్ చేసుకున్నారో అదే ఐడీ పాస్‌వర్డ్‌తో చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. కామారెడ్డి డివిజన్‌లో మూడు పరీక్షా కేంద్రాలు, బాన్సువాడ డివిజన్‌లో ఒక పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

నోటు పుస్తకాలు, దుప్పట్ల పంపిణీ

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

బాన్సువాడ, డిసెంబర్ 8 : బీర్కూర్ మండలం బరంగేడ్గి గ్రామంలోని ఉన్నత పాఠశాలలో లయన్స్ క్లబ్ నిజామాబాద్ ఆధ్వర్యంలో 100 మంది విద్యార్థులకు రాత పుస్తకాలు, 20 మంది వృద్ధులకు దుప్పట్లను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు విద్యార్థులకు, వృద్ధులకు దుప్పట్లను అందజేసినందుకు లయన్స్‌క్లబ్ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. గ్రామ సర్పంచ్ నాచారం రాములు, ఎంపీటీసీ గంగమణి గంగారాం, ఉప సర్పంచ్ నర్సింగ్‌రావు, బీఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు నాగుగొండ, పాఠశాల ప్రిన్సిపాల్ అశోక్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

నూతన ప్రభుత్వానికి స్వాగతం పలికిన ఉద్యోగులు

కలెక్టర్ జితేశ్ వీ పాటిల్‌కు స్వీట్ తినిపిస్తున్న ఉద్యోగులు

కామారెడ్డి/ఎల్లారెడ్డి, డిసెంబర్ 8 : రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పడిన సందర్భంగా శుక్రవారం కామారెడ్డి జిల్లా ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద మిఠాయిలు పంచుకొని సంబురాలు చేసుకున్నారు. నూతన ప్రభుత్వానికి స్వాగతం పలికారు. కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ నరాల వెంకట్‌రెడ్డి, టీఎన్జీవోస్ జిల్లా కార్యదర్శి సాయిలు, టీజీవోస్ జిల్లా అధ్యక్షుడు దేవేందర్, కార్యదర్శి సాయిరెడ్డి, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు. ఎల్లారెడ్డి తహసీల్ కార్యాలయ వద్ద ప్రభుత్వ ఉద్యోగులు కొత్త ప్రభుత్వానికి స్వాగతం పలికారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షుడు మహిపాల్, శరణ్, రవీందర్, రాజయ్య, స్వాతి, నర్సింగ్‌రావు, అరుణ్, రవి, అంజయ్య, నర్సింహులు, ప్రసాద్ పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ అధ్యాపకుల సంఘం అధ్యక్షుడిగా రాజు

కామారెడ్డి, డిసెంబర్ 8 : తెలంగాణ ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ అధ్యాపకుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా రాజును నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు బరిగెల నారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ.. అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమం, సమస్యల పరిష్కారం కోసం తన వంతు కృషి చేస్తానని తెలిపారు. తనపై నమ్మకం ఉంచి జిల్లా అధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు రాష్ట్ర అధ్యక్షుడు నారాయణకు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు రవికి కృతజ్ఞతలు తెలియజేశారు.

కొనసాగుతున్న ఈజీఎస్ సామాజిక తనిఖీ

బాన్సువాడ, డిసెంబర్ 8 : బాన్సువాడ మండలంలోని 25 గ్రామ పంచాయతీల్లో రెండు రోజుల క్రితం ప్రారంభమైన ఉపాధి హామీ సామాజిక తనిఖీ కార్యక్రమం కొనసాగుతున్నది. 2021-22 వార్షిక సంవత్సరంలో ఉపాధి హామీ పథకంలో 3 కోట్ల 48 లక్షల 52 వేల 101 రూపాయల పనులు కొనసాగినట్లు ఎంపీడీవో సత్యనారాయణరెడ్డి తెలిపారు. మండలంలోని 14 సభ్యులు బృందాలుగా ఏర్పడి గ్రామాల్లో 2021-22లో కొనసాగిన పనులను పరిశీలించనున్నారు. ఈ నెల 14న అన్ని గ్రామాల తనిఖీ వివరాలను ఎంపీడీవో కార్యాలయం ఆవరణలోని మండల సభలో వివరిస్తారని ఎంపీడీవో తెపారు.